సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం ׀ 17 ׀ ఫిబ్రవరి ׀ 2023



మహాశివరాత్రి ఉత్సవాలకు పొలతల ముస్తాబు

మహాశివరాత్రి సందర్భంగా నేటి నుంచి పొలతలలోఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. - 8లో



ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో నూతన జీవధార ధ్వజస్తంభ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.8/15.0

వాతావరణం

జిల్లాలో గురువారం 15.0 – 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీదే హవా!

- వైఎస్సార్‌సీపీ ఖాతాలో జమ కానున్న మరో ఎమ్మెల్సీ
- ముగియనున్న బీటెక్ రవి పదవీకాలం
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్



సాక్షి ప్రతినిధి, కడప: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ హవా స్పష్టంగా కొనసాగుతోంది. ఒక్క మండలం మినహా మిగిలిన అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కడప కార్పొరేషన్‌తో సహా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వెరసి మరో ఎమ్మెల్సీ స్థానం ఆ పార్టీ ఖాతాలో జమ కానుంది. టీడీపీ నేత బీటెక్ రవి పదవీకాలం మార్చి 29న ముగియనున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీ భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఆ మేరకు ఈనెల 13న పోలింగ్, 16న కౌంటింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈమారు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం అతి సునాయాసమని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నాటి తొలినాళ్లలోనే 2010లో జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలివిజయం దక్కించుకున్నారు. 2016లో కూడా వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ అధికారం అండ, ప్రత్యక్ష, పరోక్ష ప్రలోభాలు, భయభ్రాంత్రులకు గురిచేసి టీడీపీ కైవసం చేసుకుంది. స్వల్ప ఓట్ల తేడాతో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీ స్థానం చేజారింది. 2023 మార్చిలో ముచ్చటగా మూడవసారి నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అఖండ విజయానికి అడ్డుకట్ట వేసే అవకాశమే లేదని రాజకీయ విశ్లేషకులు విరిస్తున్నారు. కారణం ఒకే ఒక్క మండలం మాత్రమే టీడీపీ చేతుల్లో ఉండడమని వారు పేర్కొంటున్నారు.

అభ్యర్థి ఎంపికపై ఏకాభిప్రాయం..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంపికపై ఆ పార్టీలో ఏకాభిప్రాయం వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 98శాతం సభ్యులు వైఎస్సార్‌సీపీ వారే కావడంతో ఆ పార్టీ అభ్యర్థి ఎంపిక నల్లేరుపై నడకే. అయినా సరే అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థికి పట్టం కట్టడమే తరువాయిగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులున్నారు. అభ్యర్థి ఎంపికకు పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కాకపోతే రాజకీయ అనుభవం, అర్హత, సమీకరణలు పరిగణనలోకి తీసుకొని అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని పలువురు నాయకులు తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒక సీనియర్ రాజకీయ అనుభవం ఉన్న నేత పేరును సూచించినట్లు సమాచారం. జిల్లా నేతల ఏకాభిప్రాయం మేరకు అధికారికంగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించాల్సి ఉంది. ఈమారు అత్యంత సునాయాసంగా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందనడంలో సందేహం లేదు.

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కడప సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బరిలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, ప్రచార కార్యకర్తలు కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని.. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సి.ఎం. సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. గురువారం ఉదయం కడప స్థానిక సంస్థల నియోజకవర్గపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నూతన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఈ నెల 18న మహాశివరాత్రి పండుగ, 19న ఆదివారం సెలవు దినం కావడంతో ఆ రెండు రోజులు నామినేషన్లు స్వీకరించమన్నారు. 24న నామినేషన్ల పరిశీలన, 27వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అన్నారు. అలాగే మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి 16న ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, ఎన్నికలకు సంబంధించి ఈ ప్రక్రియలన్నీ మార్చి 21న ముగుస్తాయన్నారు.

పటిష్టంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ: పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జేసీ సాయికాంత్ వర్మ, ఏఎస్పీ తుషార్‌డూడి, నగర పాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్‌మీనా, ప్రవీణ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ఈ ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా లేని వారిని మాత్రమే నియమించాలన్నారు. వారి సొంత మండలంగానీ, వారు విధులు నిర్వర్తించే మండలానికిగానీ విధులను కేటాయించరాదన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికలకు అవసరమైన వాహనాలను రూట్ మ్యాప్ వేసుకుని ఆ ప్రకారంగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల పరంగా ఏవైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే 1950 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, సీపీఓ వెంకట్రావు, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, ఏపీఎంఐపీ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్ నాయక్, రామ్మోహన్‌రెడ్డి, రవీంద్రారెడ్డితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలి రోజు రెండు నామినేషన్లు



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రవీంద్రారెడ్డి



ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యరి రామచంద్రారెడ్డి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల తొలి అంకం నామినేషన్ ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ ఈనెల 23 వరకు ఉంటుందన్నారు. 24న పరిశీలన నిర్వహిస్తారన్నారు. ఉపసంహరణకు 27 వరకూ అవకాశముంటుందన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల దాఖలు..

తొలి రోజున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎం.వి.రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీకి వెన్నపూస రవీంద్రారెడ్డి నామినేషన్ వేశారు. ఆర్‌ఓకు ఆయన చాంబర్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు. ఒక సెట్ నామినేషన్ వేసిన ఇరువురు అభ్యర్థులు రెండో సెట్‌ను ఈనెల 22న దాఖలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం విలేకరులతో ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడారు.

పటిష్ట బందోబస్తు

నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆర్‌ఓ కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు హద్దులు నిర్ణయించి పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసు అధికారులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సంక్షేమ పథకాలే బలం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దీవెనలతో, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఆశీర్వాదంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నాకు గొప్ప బలం. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారు. రాయలసీమపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. నాకు ఓటు వేయాలని పట్టభద్ర ఓటర్లను వినమ్రంగా కోరుకుంటున్నా. – వెన్నపూస రవీంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

సమస్యల పరిష్కారానికి కృషి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో, అధికార పార్టీతో పాటు 36 ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓటర్లు నాకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. -రామచందారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

న్యూస్‌రీల్

పలు రైళ్ల కుదింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: మధురై–తిరుపరం గంధరం–తిరుమంగళం మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న తరుణంలో.. ఆ మార్గంలో తిరిగే పలు రైళ్లను కుదించి నడపనున్నారని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎన్ రెడ్డి, కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు. లోకమాన్య తిలక్–మధురై (22101) ఈ నెల 22, మార్చి 1న విల్లుపురం వరకే నడుస్తుందని వారు పేర్కొన్నారు. అలాగే మధురై–లోకమాన్య తిలక్ (22102) రైలు ఈ నెల 17, 24 తేదీల్లో విల్లుపురం నుంచి లోకమాన్య తిలక్ వరకు నడుస్తుందన్నారు. విల్లుపురం నుంచి మధురై వరకు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. రామేశ్వరం–ఓకా (16733) మధ్య తిరిగే రైలు ఈ నెల 17, 24, మార్చి 3 తేదీల్లో సేలం వరకు మాత్రమే నడుస్తుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో ఈనెల 21, 28 తేదీలలో ఓకా–రామేశ్వరం (16734) రైలు సేలం నుంచి ఓకాకు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాలను గుర్తించి తమ ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

రుణాలను చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్: బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఖాతాదారుడు సహకరించాలని డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్ర కుమార్ కోరారు. గురువారం కడప ఎన్‌జీఓ కాలనీ (కడప డీసీసీ బ్యాంకు) బ్రాంచ్‌లో మేనేజర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో ఖాతాదారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బ్యాంకులో తీసుకున్న అప్పులను సక్రమంగా చెల్లిస్తే మళ్లీ, మళ్లీ సహకారం లభిస్తుందన్నారు. అలాకాకుండా రుణం సక్రమంగా కట్టకపోతే బ్యాంకు మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాలు ఇవ్వడంలో కడప బ్యాంకు ముందు ఉందన్నారు. బ్రాంచి మేనేజర్ జయలక్ష్మి మాట్లాడారు. అనంతరం కొంత మంది ఉత్తమ ఖాతాదారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ బ్రాంచు నోడల్ ఆధికారి భారతి, హెచ్ఓ, ప్రముఖ ఓన్‌జీఓ ఓబులదాసు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో లిప్‌ను తప్పని సరిగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అన్నమయ్య డీఈఓ రాఘవరెడ్డి

అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల డీఈఓలు రాఘవరెడ్డి, దేవరాజు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతి పాఠశాలలో తప్పని సరిగా లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం(లిప్)ను అమలు చేయాలని అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల విద్యాశాఖ అధికారులు రాఘవరెడ్డి, దేవరాజులు పేర్కొన్నారు. గురువారం కడప నగరపాలక కార్యాలయ సమావేశ మందిరంలో అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో లిప్‌లో శిక్షణ పొందిన ఎంఈఓలు, హెచ్‌ఎంలు, జిల్లా రీసోర్సుపర్సన్‌లకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్తు, నగరపాలక, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ యాజమాన్యాలలో 6 నుంచి 8 తరగతులకు తప్పని సరిగా లిప్‌ను ప్రతి పాఠశాలలో అమలు చేయాలని ఆదేశించారు. బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ లిప్ ప్రోగ్రాం అమలు చేయడం వల్ల విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్ భాషలు చదవడం, రాయడం సరళంగా నేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప డివిజన్ డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, అన్నమయ్య డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, కడప ఎంఈఓ పాలెం నారాయణలతోపాటు పలు మండలాల ఎంఈఓ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఆర్టీసీ ఏర్పాట్లు

- శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు



మాట్లాడుతున్న కడప జోన్ ఈడీ

కడప కోటిరెడ్డిసర్కిల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ విశేష ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపి నాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప రీజియన్ పరిధిలో 251 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కడప నుంచి పొలతలకు 80, నిత్యపూజ కోనకు 30, పులివెందుల నుంచి పొలతలకు 30, ప్రొద్దుటూరు నుంచి పొలతలకు 15, బద్వేలు నుంచి లంకమలకు 22, మైదుకూరు నుంచి లంకమలకు 12, మైదుకూరు నుంచి జ్యోతికి వయా సావిశెట్టిపల్లెకు 4, పోరుమామిళ్ల నుంచి జ్యోతికి 6, మైదుకూరు నుంచి బి.మఠంకు 11, బద్వేలు నుంచి బి.మఠంకు 4, మల్లెకొండకు 3, పోరుమామిళ్ల నుంచి ఎస్ఎస్ మఠంకు 3, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, సంగమేశ్వర దేవళాలకు 6, జమ్మలమడుగు, అగస్త్యేశ్వరకోనకు 5, ప్రొద్దుటూరు నుంచి అల్లాడుపల్లె దేవళాలకు 10, పులివెందుల నుంచి భానుకోటకు 2, ప్రొద్దుటూరు నుంచి కన్యతీర్థంకు 6, జమ్మలమడుగు నుంచి కన్యతీర్థంకు 1 చొప్పున మొత్తం 251 బస్సులను ఏర్పాటు చేశామన్నారు

ప్రశాంతంగా వైవీయూ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



జిల్లాలోని ఓ పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రథమ, తృతీయ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 79 కళాశాలలకు చెందిన విద్యార్థులకు 57 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30,218 మంది విద్యార్థులకు గాను 5 శాతం మేర విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి పూజలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్ప నూతన ఆలయ నిర్మాణానికి గురువారం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, మేడా రఘునాథరెడ్డి భూమి పూజ నిర్వహించారు. నగరంలో తొలి అయ్యప్ప ఆలయమైన దీనిని శబరి మలలోని ఆలయం లాగా నిర్మించేందుకు ఇటీవల బాల ఆలయం కూడా నిర్మించారు. కేరళ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన స్థపతి, శిల్పులు, నెల్లూరు నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ ఆలయ నిర్మాణం, అభివృద్ధి కోసం తమవంతుగా ప్రయత్నించి ప్రభుత్వం ద్వారా సహకారం అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మేడా భాస్కర్‌రెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డి, మేడా వెంకట శేషారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌బీ అహ్మద్‌బాష, పోతుల వెంకట్రామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా రూ. 5 కోట్లతో నిర్మించనున్న ఈ ఆలయ నిర్మాణానికి తన వంతుగా ప్రముఖ కాంట్రాక్టర్ మేడా రఘునాథరెడ్డి రూ.1.5 కోట్లు విరాళం ప్రకటించారు.

జిల్లాలో రీ సర్వే హౌసింగ్ పనులు వేగవంతం

- కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనులు, భూ సేకరణ, హౌసింగ్ నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ విజయ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రీ సర్వే, భూ సేకరణ, హౌసింగ్, వ్యవసాయ, అనుబంధం శాఖలు, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, ఈ–క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (సీఎస్) డాక్టర్ జవహర్‌రెడ్డి, సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని బోర్డు హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ సాయికాంత్‌వర్మ, సంబంధిత జిల్లా అధికారులు హాజరయ్యారు. సీఎస్ వీడియోకాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జాతీయ రహదారులు, ఏపీఐఐసీ కోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. స్పందన అర్జీలపై సకాలంలో స్పందించి అర్జీదారులకు పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాతపరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: కడప నగరంలో ఈనెల 19న ఆదివారం నిర్వహించనున్న ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. గురువారం నగరంలోని 'పెన్నార్' కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్ష నిర్వహించి భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకూ జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడారు.

- కడప నగరంలోని 11 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 9540 మంది అభ్యర్థులు హాజరు కానున్నారనీ తెలిపారు. 11 కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తప్పక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలన్నారు. మొబైల్స్, ఇతర డిజిటల్ పరికరాలు అనుమతించకూడదన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. 'ప్రతి సెంటర్‌లో పోలీసు సిబ్బందితో పాటు ఫ్లెయింగ్ స్క్వాడ్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, వైవీయూ ప్రొఫెసర్, రీజియన్ కో– ఆర్డినేటర్ డాక్టర్ రఘునాథరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ బి. రాజాప్రభాకర్, ఆర్.ఐ సోమశేఖర్ నాయక్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కార హీనంగా లోకేష్ భాష

- తండ్రీ కొడుకులు అచ్చోసిన ఆంబోతుల్లా మాట్లాడుతున్నారు
- ముందు నువ్వెక్కడ పుట్టావో, ఎక్కడ పెరిగావో చెప్పు లోకేశ్
- మాకు సంస్కారం ఉంది..లేదంటే మీకంటే ఎక్కువ బూతులు మాట్లాడగలం
- భరిస్తున్నాం కదా అని ఇష్టారీతిన మాట్లాడితే మూల్యం చెల్లించుకోవాల్సిందే
- అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

కడప కార్పొరేషన్: నారా లోకేష్ మాట్లాడుతున్న భాష సంస్కార హీనంగా ఉందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్ జిల్లా కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ రాయలసీమలో పుట్టాడా అని లోకేష్ మాట్లాడాడని, వైఎస్ జగన్ జమ్మలమడుగులోని క్యాంప్‌బెల్ ఆసుపత్రిలో పుట్టారని, లోకేష్ ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో ఆయనకైనా తెలుసా అని ప్రశ్నించారు. రాయలసీమలో పుట్టిన మేము నీకంటే ఎక్కువ బూతులు మాట్లాడగలమని .. కానీ మాకు సంస్కారం ఉంది కాబట్టే మాట్లాడటం లేదన్నారు. ఊరిపైన వదిలేసిన అచ్చోసిన ఆంబోతుల్లాగా తండ్రి, కొడుకులు పచ్చి బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహిళా ప్రజా ప్రతినిధులను విచిత్రమైన పేర్లతో సంబోధిస్తూ సంస్కార హీనంగా మాట్లాడటం దారుణమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు తాను ఏం చేస్తాడో, పేదరికంపై ఎలా పోరాడుతారో చెప్పారని గుర్తు చేశారు. మీ పాదయాత్రలో మీ పార్టీ విధానం ఏమిటో, మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో, మళ్లీ వస్తే ఏం చేస్తారో చెప్పకుండా తిట్లదండకం ఎందుకు చదువుతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు , లోకేష్ వారి యాత్రలలో జనాలు లేరని నిరాశకు గురై ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. లోకేష్ తెలుగులో ప్రావీణ్యం లేక పచ్చి బూతులు మాట్లాడుతున్నాడన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేష్ దొంగచాటుగా ఎమ్మెల్సీ అయ్యాడని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల్లో చులకన చేయడానికే పదే పదే సైకో అని విమర్శిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా మీరు మేనిఫెస్టో దాచిపెట్టారని, వైఎస్ జగన్ ఎన్నికల మేనిఫెస్టోనే భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని 95 శాతం హామీలను అమలు చేసినందుకు సైకో అంటున్నారా ...అని ప్రశ్నించారు. బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డిని వైఎస్ జగన్ ఎలా చూసుకున్నారో అందరికీ తెలుసని, వ్యక్తిత్వాన్ని హననం చేసేలా మాట్లాడటం మానుకోవాలన్నారు. వైయస్ కుటుంబం మంచితనం ఎంచుకుంటే నారా కుటుంబం చెడును ఎంచుకుందని తెలిపారు.తండ్రి , కొడుకులకు రాయలసీమ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. రాయలసీమ ప్రజలను అథఃపాతాళానికి తొక్కేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కర్నూలుకు హైకోర్టు వస్తుంటే ఆయన ఓర్వలేకపోతున్నారన్నారు. భరిస్తున్నామని ఇంకా మాట్లాడితే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కె. కొండయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెన్నిస్ చాంపియన్‌షిప్ ప్రారంభం



క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కడప ఆఫీసర్స్ క్లబ్ వేదికగా ఆలిండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ చాంపియన్‌సిప్ ప్రారంభమైంది. గురువారం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన క్రీడాకారుల మధ్య క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు జీవా విలియమ్స్, మామిళ్ల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సి.ఎం.సాయికాంత్‌వర్మల చేతుల మీదుగా టోర్నమెంట్ ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బావను చంపిన బామ్మర్ది
– సెల్‌ఫోన్ విషయంలో ఘర్షణ



బాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కమలాపురం : బావను బామ్మర్ది చంపిన సంఘటన కమలాపురం నగర పంచాయతీలోని రామచంద్రాపురంలో చోటు చేసుకుంది. కమలాపురం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిట్టింటుకల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న మావిళ్ల బాబు(40) తన బామ్మర్ది రమణయ్య వద్ద నెల రోజుల క్రితం రూ.2 వేలు అప్పుగా తీసుకుని సెల్‌ఫోన్ కొనుగోలు చేశాడు. నెల రోజుల తరువాత డబ్బులు ఇవ్వకపోతే సెల్‌ఫోన్ ఇచ్చేటట్లు వారి మధ్య ఒప్పందం కుదిరింది. నెల రోజులు గడిచినా.. బాబు డబ్బు ఇవ్వకపోవడంతో రమణయ్య సెల్‌ఫోన్ తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో బాబు భార్య (రమణయ్య అక్క సుబ్బమ్మ) తన కుమారుడికి ఆన్‌లైన్ క్లాసులు ఉన్నాయని తమ్ముడిని అడిగి సెల్‌ఫోన్ తీసుకెళ్లింది. డబ్బు ఇవ్వకపోతే సెల్‌ఫోన్ ఇవ్వాలని గురువారం బావ బామ్మర్ది మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో రమణయ్య తన బావ బాబుపై కర్రతో దాడి చేశాడు. దీంతో బాబు తలపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని కమలాపురం సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో బాబు మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



- శాస్త్రోక్తంగా నిర్వహణ
- భారీగా పాల్గొన్న భక్తజనం



ధ్వజ స్తంభ ప్రతిష్టలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూర్వపు మఠాధిపతుల కుమారుడు శ్రీవెంకటాద్రిస్వామి

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో నూతన జీవధార ధ్వజస్తంభ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. దాతల చేత ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని మఠం నిర్వాహకుల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. మఠం వేద పండితులతో మూడు రోజుల పాటు ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీవెంకటాద్రిస్వామి, శ్రీ వీరభద్రస్వామి, వీరంభట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరాజుల స్వామిలు ఈ కార్యక్రమంలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. కలసపాడు మండలం ఎగువ తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన గంగసాని వంశస్తులు ధ్వజస్తంభాన్ని తెప్పించారు. గతంలో కూడా రెండు సార్లు వారే ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని వీక్షించి, తన్మయులయ్యారు. కార్యక్రమంలో శ్రీఈశ్వరీదేవి మఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి, తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి, ప్రొద్దుటూరు చెందిన కృష్ణమాచారి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ఎండోమెంట్ ఏసీ, బి.మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, కందిమల్లాయపల్లె పుర ప్రజలు పాల్గొన్నారు. మైదుకూరు డీఎస్పీ, రూరల్ సీఐ, ఖాజీపేట ఎస్‌ఐ, బి.మఠం ఏ ఎస్‌ఐ, పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవాలు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో జగద్గురు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. శుక్రవారం నుంచి మంగళవారం వరకు (ఐదు రోజుల పాటు) నిర్వహించనున్నారు.

- శుక్రవారం తెల్లవారుజామున శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సుప్రభాతం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం మఠాధిపతుల మూలపురుషులు శ్రీ పెద్ద గోవింద స్వాముల ప్రథమ పుత్రుడు శ్రీ గోవింద స్వామి ధర్మపత్ని వీరపాపమాంబ వారి ఆరాధన– ద్వారపూజ చేస్తారు.
- శనివారం రాత్రి 8 గంటల నుంచి స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం నరనంది ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశ రుద్రాభిషేకం (జాగరణ) చేస్తారు.
- ఆదివారం మోహినీ అలంకారోత్సవం, నంది ఉత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయి.
- సోమవారం మధ్యాహ్నం మహాప్రసాద వినియోగం, పుష్పరథోత్సవం నిర్వహిస్తారు.
- మంగళవారం కొట్నోత్సవం, వసంతోత్సవం నిర్వహించి, పూర్ణాహుతి సమర్పిస్తారు.
- ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి కోరారు.

ఈశ్వరీదేవి మఠంలో..

శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం కలశస్థాపన, అభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తారు. శనివారం ఉదయం శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణమూర్తుల తులాభారం కార్యక్రమం కమనీయంగా జరుగుతుంది. రాత్రి 7 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున రుద్రాభిషేకం (జాగరణ) ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేస్తారు. ఆదివారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణమూర్తుల గ్రామోత్సవం, శ్రీ ఈశ్వరీదేవి సింహవాహన గ్రామోత్సవం జరుగుతాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సోమవారం మహాప్రసాద వినియోగం ఉంటుంది. నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలను మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పొలతల ముస్తాబు

నేటి నుంచి ఉత్సవాలు

పెండ్లిమర్రి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో ప్రముఖమైనది పొలతల. ఇక్కడ మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయకుడు, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారు కొలువైనారు. కాశినాయన ఆశ్రమం ఉంది. మహాశివరాత్రి ఉత్సవాలకు పొలతల ముస్తాబైంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటి డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టనున్నారు.

ముత్యాల తలంబ్రాలతో కల్యాణం

పొలతల శైవ క్షేత్రంలో శుక్రవారం ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకుపూజ, అభిషేకాలంకరణ వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. శనివారం చండీ హోమం, పూర్ణాహుతి, రథ ప్రతిష్ఠ, కుంకుమార్చన అనంతరం ఉదయం 10 గంటల నుంచి ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం ముంగింపు ఉత్సవ కార్యక్రమాలు ఉంటాయి.



ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరస్వామి



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

'మారెడ్డి ఆనందరెడ్డి' సేవలు మరువలేనివి



మారెడ్డి ఆనందరెడ్డి, ప్రమీలరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

కడప కల్చరల్ : నగర ప్రముఖులు, సంఘ సేవకులు మారెడ్డి ఆనందరెడ్డి సేవలను మరువలేమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఈగల్ డిస్టిలరీస్ యజమాని లయన్ మారెడ్డి ఆనందరెడ్డి తొలి వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నగర శివార్లలోని ఆయన కర్మాగారం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరెడ్డి తోపాటు ఆయన సతీమణి ప్రమీలరెడ్డితో కలిపి ఘాట్‌ను నిర్మించారు. క్రైస్తవ గురువులు ఫాదర్ జోజిరెడ్డి, ఫాదర్ లారెన్స్ దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆనందరెడ్డి దంపతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు ఘాట్‌ను దర్శించుకుని ఆనందరెడ్డి దంపతుల ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతహాగా దానశీలి అయిన ఆనందరెడ్డి కర్మాగారం నుంచి వందలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా పేదలు, అనాథలకు ఎంతో సాయం చేశారని, నగర వాసుల దాహం తీర్చేందుకు ట్యాంకర్లు, బోర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం మరువలేమన్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు సతీష్‌రెడ్డి, కోడలు వీణారెడ్డి, కుమార్తెలు విజయ, సౌభాగ్యరాణి, సురేష్‌రెడ్డి, అనిత విష్ణురెడ్డి, లీల డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఆనందరెడ్డి, ప్రమీలరెడ్డిల చిత్రపటాలను ఆవిష్కరించారు. ఘాట్‌పై పూలమాలలు సమర్పించి ప్రార్థనలు జరిపారు. ఫిలడెల్ఫియా నుంచి విచ్చేసిన ఆనందరెడ్డి సోదరి వంగల మేరిరెడ్డి, డాక్టర్ వెంకట్రామిరెడ్డిలు కూడా ఘాట్‌ను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. మారెడ్డి అనంతమ్మ, మేరీ, జోసఫినమ్మ, వైఎస్ నిర్మల, మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నిర్మలమ్మ, లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి, విజయ, ప్రముఖ వైద్యులు కరుణాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, హరికిషోర్‌రెడ్డి, వంశి తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆనందరెడ్డి దంపతుల బంధుమిత్రులు, ఆత్మీయులు, ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా,మాజీ మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి బుధవారం ఆనందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని చిన్నారి మృతి

అదే బడిలో చదువుతున్న మృతురాలి అక్క



చిన్నారి జాహ్నవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



చిన్నారి మృతికి కారణమైన స్కూల్ వ్యాన్

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ ఎస్టీ కాలనీ వద్ద గురువారం స్కూల్ వ్యాన్ ఢీకొని ఓ చిన్నారి మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మొయిళ్లకాల్వకు చెందిన వడ్డెమాని మధుసూదన్‌రెడ్డి, పార్వతి దంపతులకు సాయి, జాహ్నవి (2) అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సాయి వెల్లటూరులోని సత్యసాయి హైస్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. సాయిని తండ్రి మధుసూదన్‌రెడ్డి స్కూల్ వ్యాన్ వద్దకు తీసుకువచ్చి ఎక్కించాడు. తండ్రి వెనుక వైపు చిన్నారి జాహ్నవి వచ్చింది. అది గమనించలేదు. ఎవరూ లేరని స్కూల్ వ్యాన్‌ను డ్రైవర్ ముందుకు పోనించాడు. చిన్నారి జాహ్నవి వ్యాన్ ముందు టైరు కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమా?

ప్రయివేట్ స్కూల్ నడుపుతున్న యాజమాన్యం విద్యార్థులను ఇళ్ల వద్ద నుంచి స్కూల్‌కు వ్యాన్‌లో ఎక్కించుకోడానికి వెళ్లినప్పుడు డ్రైవర్లు మాత్రమే ఉన్నారు. స్కూల్ వ్యాన్‌లకు క్లీనర్లు గానీ, స్కూల్ సిబ్బంది గానీ ఉండడం లేదు. దీని కారణంగా చిన్నారి జాహ్నవి నిండు ప్రాణాన్ని స్కూల్ వ్యాన్ బలి తీసుకుంది. స్కూల్ వ్యాన్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే చిన్నారి మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు మాయమవుతున్నాయని ఫిర్యాదు

పోరుమామిళ్ల : తమ అకౌంట్ల నుంచి డబ్బులు మాయం అవుతున్నాయని బ్యాంకర్లకు ముగ్గురు ఫిర్యాదు చేశారు. చెన్నవరం గ్రామానికి చెందిన వంకెల నాగస్వామిరెడ్డికి స్టేట్ బ్యాంకులో అకౌంటు ఉంది. బుధవారం రెండు దఫాలు రూ.పది వేల చొప్పున డ్రా అయినట్లు మేసేజ్ వస్తే, తనకు తెలియకుండా ఎవరు డ్రా చేశారో అర్థం కాక, గురువారం మేనేజర్ దగ్గరకు వెళ్లి అడిగాడు. ఎలా జరిగిందో తనకు అర్థం కావడం లేదని, ఉన్నతాధికారులను అడిగి తెలుసుకుంటానని మేనేజర్ సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రగతి రాయలసీమ గ్రామీణ బ్యాంక్‌లో పట్టణానికి చెందిన షరీఫ్ అకౌంటులో బుధవారం రూ.14,500, మహమ్మద్ షఫీవుల్లా అకౌంటులో రూ.30 వేలు మాయమయ్యాయి. షఫీ ఉల్లాకు యూనియన్ బ్యాంకులో ఉన్న అకౌంటు నుంచి రూ. 20000 మాయమైంది. దీనిపై వారు ఏపీజీబీ, యూనియన్ బ్యాంకుల మేనేజర్లను కలిశారు. అకౌంటులో ఎవరూ డబ్బు తీయలేదని, కానీ డ్రా ఎలా జరిగిందో అర్థం కావడం లేదని, దీనిపై విచారణ చేస్తామని మేనేజర్లు సమాధానం ఇచ్చినట్లు బాధితులు చెప్పారు. వారిలాగే డబ్బులు పోయినట్లు బ్యాంకుకు మరి కొందరు వెళ్లినట్లు తెలుస్తోంది. విషయం పోలీస్‌స్టేషన్ చేరడంతో సీఐ సురేష్‌రెడ్డి దీనిపై దృష్టి సారించారు. గురువారం సాయంత్రం సీఐ స్టేట్ బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్ చేయగా ఆయన లిఫ్ట్ చేయలేదు. దాంతో సీఐ ఈ విషయమై ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు తీసుకొని శుక్రవారం బ్యాంకుకు వెళ్లి విచారణ చేస్తామన్నారు.

వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో 195 కేసులు

కడప అర్బన్ : జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు పాటించని వాహనదారులపై మొత్తం 105 కేసులను నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ లేని కేసులు 95, సీట్ బెల్ట్ ధరించని కేసులు 10 వున్నాయి. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు.

బహిరంగ చర్చకు సిద్ధమైన నేతలు

- కడప ఏడురోడ్ల కూడలి వద్ద ఉద్రిక్తత
- అడ్డుకున్న పోలీసులు, పలువురి అరెస్ట్



క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు సర్ది చెబుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరాభివృద్ధిపై టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఇరుపార్టీల నాయకులు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుని, 16వ తేది ఏడురోడ్ల కూడలిలో చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ఇరుపార్టీల్లోని ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయం, ఏడు రోడ్ల కూడలిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగానే డిప్యూటీ సీఎం కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకున్న కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బహిరంగ చర్చకు పోతామని పట్టుబట్టారు. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ఎంత చెప్పినా వారు వినిపించుకోలేదు. క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఏడురోడ్ల కూడలికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఏడు రోడ్ల కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. నిరసన తెలుపుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, దాసరి శివప్రసాద్, తోటక్రిష్ణ, సుబ్బరాయుడు, త్యాగరాజు, లక్ష్మినారాయణ, బసవరాజు తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కె. సూర్యనారాయణరావు, షఫీ, కె. బాబు, పార్టీ నాయకులు ఐస్‌క్రీం రవి, రామ్మోహన్‌రెడ్డి, జఫ్రుల్లా, రామక్రిష్ణారెడ్డి, మనోజ్, సంపత్, శ్యాంసన్ పాల్గొన్నారు. కాగా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం పట్ల మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, క్రిష్ణవేణి, మూలే సరస్వతి, సునీత, సుశీలమ్మ, నారాయణమ్మ, తులశమ్మ, మల్లీశ్వరి, రామలక్షుమ్మ, జింకా జయలక్ష్మి, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, జమాల్‌వలీ, సీహెచ్ వినోద్, సుబ్బారెడ్డి, ఆర్‌వీ రమణ, బండి ప్రసాద్ పాల్గొన్నారు.

నదుల అనుసంధానంపై అధ్యయనం

రాజోలి ఆనకట్టను పరిశీలించిన కేంద్ర జలవనరుల శాఖ అధికారులు

రాజుపాళెం : నదుల అనుసంధానంపై జిల్లా సరిహద్దులోని రాజోలి ఆనకట్ట ఉద్ద ఉన్న కుందూ నదిని కేంద్ర జలవనరుల శాఖ, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అధికారులు సంయుక్తంగా గురువారం పరిశీలించారు. సౌత్ ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజినీర్ డాక్టర్ ఆర్యన్ సంభవ, డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాసులు, రామరాజు బృందం కుందూ నది, రాజోలి ఆనకట్టను చూశారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో నదుల అనుసంధానంపై చర్చించారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నిప్పుల వాగు, గాలేరు, సంతజూటూరు, రాజోలి, ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వరకు వారు పర్యటించారు. ఏ నది ఎక్కడ కలుస్తుందో తదితర విషయాలను వారు అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వారి వెంట కేసీ కెనాల్ డీఈ బ్రహ్మారెడ్డి, ఏఈ జమాల్ వలి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.